"ఏమండీ...ఏమండీ... లేవండీ ఘోరం జరిగిపోయింది!"

"అబ్బా... పొద్దునే ఏమిటే నీ పాడు గోల?"

"పాడుగోల, యమగోల కాదండీ విధిలీల. అనర్థం జరిగిపోయింది. నా నోటితో నేను చెప్పలేను. "మన బిడ్డ, ముద్దుల బిడ్డ కనిపించడంలేదండీ. పొద్దున్నే లేచి నా చుట్టూ తిరిగే మీ అబ్బాయి ఇక మనకు లేడండీ"


"చాల్లే ఊరుకో సంబడం. ఉబుసు పోనమ్మ ఉట్టి పట్టుకుని ఏడ్చిందని... నీకు లేని పిల్లాడు ఎలా తప్పిపోయాడే?"

"అదేనండీ మన టామీ పొద్దున్నుండీ కనబడడంలేదండీ... కనబడడంలేదు."

"నువ్వు ముందు ఆ టీవీ సీరియల్‌లో హీరోయిన్‌లా ఏడవడం ఆపు. అయినా కుక్క నీకు బిడ్డ ఏమిటి? నేను దానికి తండ్రినేమిటి? ఎవరైనా వింటే నవ్విపోతారు."

# కుక్క దొరికింది...

-షకీల్ అహ్మద్



"ఏమండీ... నన్నేమైనా అనండి కానీ నా బిడ్డను కుక్క అంటే మాత్రం నేను ఒప్పుకోను. అది నా ఆరోప్రాణం."

"అందుకని నా పంచప్రాణాలు గాలిలో కలిసిపోయినా నీ ఆరోప్రాణాన్ని వెదికి పట్టుకోమంటావు అంతేనా?"

"అంతేనండీ... ముమ్మాటికీ అంతే"

ఇక దాన్ని వెదకడానికి బయలుదేరక తప్పలేదు గుర్నాథానికి. నాలుగు సందులు చూసి ఇహ లాభం లేదనుకుంటుండగా ఎదురుగా 'సదా మీ సేవలో' అన్న బోర్డు కనబడింది. ఇదేదో పనిలేనివాళ్ల ఆఫీసులా వుందే అనుకుంటూ లోనికి అడుగుపెట్టాడు గుర్నాథం. ఎదురుగా లావుగా కనిపించిన మనిషి దగ్గరకు వెళ్లి తన సమస్యను విన్నవించుకున్నాడు.

"ఇంతకీ పేరేంటన్నావు?" అడిగాడు సన్యాసిరావు.

"నేనెప్పుడన్నానండీ!" ఆశ్చర్యంగా చూసాడు గుర్నాథం.

"ఏమిటీ ఎకసెక్కాలా! నాకంత మతిమరుపేమీలేదు. నువ్వు నీ పేరు చెప్పలేదని నాకు బాగా గుర్తుంది. ఇప్పుడు చెప్పి తగలడు"

"టామీ అండీ"

"ఆ పేరు జనరల్‌గా కుక్కలకుంటుందే?"

"నేను చెప్పేది మా కుక్క పేరే"

"నేనడిగింది మీ పేరు?"

" నా పేరు గుర్నాథమండీ. నన్నందరూ నాథం అని పిలుస్తారండీ"

"ఏడ్చినట్టుంది. నాథం ఏమిటి శ్రాద్ధంలాగా. నేను మాత్రం నిన్ను పూర్తి పేరుతోనే పిలుస్తాను. ఇంతకీ నువ్వొచ్చిన పనేమిటో చెప్పనేలేదు"

"అదేంటండీ గుమ్మంలోకి అడుగుపెట్టగానే ఎదురుగా గుమ్మడిపండు లాగ, భూమిమీద కూర్చున్న మరో భూమిలాగ మీరు కనిపిస్తే నేనొచ్చిన సంగతి చెప్పానుగదా. మరచిపోయారా?"

"చాల్లే నీ ఉపమానాలు. ఏదో కాస్త బొద్దుగా ఉంటానుతప్ప మరీ అంత లావేం కాదు నేను. ఏదో పరధ్యానంలో ఉండి ఏమరిచానుతప్ప మరచిపోవడమన్నది మా ఇంటావంటాలేదు. అయినా రోజూ సవాలక్ష పళ్లేని పళ్లతో కిందా మీదా పడే నాకు నీ సమస్య అంతగా గుర్తుండకపోవడంలో ఆశ్చర్యం లేదు జగన్నాథం."

"అయ్యా... నా పేరు గుర్నాథం"

"అదేలేవయ్యా.. ఆ... ఇప్పుడు నీ సమస్య నాకు లీలగా గుర్తుకొస్తోంది...వస్తోంది"

"ఏంటి వచ్చేది? అయినా లీలగా జానకిగా ఏమిటి... నా సమస్య తక్కున గుర్తుకురావాలి"

"వచ్చిందయ్యా. పొద్దుట్నుండీ మీ ఆవిడ కనిపించడంలేదు. ఆ దిగులుతో మీ కుక్క మంచం పట్టింది. అది పోతే నీకు రెండో పెళ్లి చేయాల్సిన బాధ్యత మాదే అంతేకదా"

"నా మొహం... మీరు నా సమస్యనంతా తారుమారు చేసారు. పొద్దుట్నుండీ మా కుక్క కనిపించడంలేదు. అసలే దాన్ని మా ఆవిడ కన్నబిడ్డలా చూసుకుంటుంది. దాంతో దానిపై దిగులు పెంచుకుని మంచంమీద ఉత్తినే పడుకుని వంటావార్పూ మానేసింది. ఆ కుక్క కనుక వెంటనే దొరక్కపోతే మా ఆవిడ చేతిలో నాకు మూడినట్టే సన్నాసిరావుగారూ"

"నా పేరు సన్నాసిరావు కాదు, సన్యాసిరావు. అయినా మేము నీకు కుక్కలు పట్టేవాళ్లలాగా కనిపిస్తున్నామా? ఏదో నామమాత్రపు ఫీజు తీసుకుని మీలాంటివాళ్ల అవసరం పడినవాళ్లకు చిన్న చిన్న సహాయాలు చేయాలని స్వయం ఉపాధి పథకం కింద ఈ 'సదా మీ సేవలో...' అనే ఆఫీసు పెట్టామే అనుకో... అలాగని అయిందానికీ, కానిదానికీ వచ్చేయడమేనా? చెప్పు పేర్నాథం"

"అయ్యా... నా పేరు గుర్నాథం"

"ఆ.. అదే! ఏదో నీ మొహం చూసి మనవాడిలా వున్నావనీ, పైగా మానవుడిలా ఉన్నావని ఒప్పుకుంటున్నా. నీ కుక్క గురించి పేపర్లో వేయిస్తాం. మనుషులను పెట్టి వెదికిస్తాం. దొరికిందా సరేసరి. లేదా అచ్చు మీ పోలికలతో వుండే కుక్కను..."


"నా పోలికలా?"

"అదేనయ్యా... మీ కుక్క పోలికలు అనబోయి తెచ్చి దాని తల్లి అదే మీ ఆవిడ ఒళ్లో వేస్తాం. సరేనా?"

"ఇంతకీ మీ ఫీజు గురించి సెలవివ్వలేదు"


"ఆ ఫీజుదేముందిలే. ఇప్పుడు అడ్వాన్స్‌గా ఓ ఐదువేలు డిపాజిట్ చేయించండి. ఆ తరువాత కుక్క దొరికాక దాని రూపురేఖలు అవీ చూసి మిగతా మాట్లాడుకోవచ్చు"

"ఐదువేలా? అన్యాయం. ఆ డబ్బుతో మరో కుక్కను కొనుక్కోవచ్చు"



## ప్రియమణి ఆనందం

గ్లామరస్ పాత్రల్లో నటిస్తేనే డబ్బు, క్రేజ్ వస్తుందని అందరు హీరోయిన్లు భావించినట్లే ప్రియమణి కూడా అదే విధంగా ఆలోచిస్తోంది. అందుకే ప్రియమణి మాస్‌ని ఆకట్టుకునే పాత్రలను చేయడానికి ఇష్టపడుతోంది. తెలుగు, మలయాళంలో నిర్మాతలు తనకి మాస్ పాత్రలు ఇస్తున్నందుకు ఎంతగానో సంతోషపడుతోంది.



"కొనుక్కోవచ్చు. కానీ మీ ఆవిడ ఉంది చూసారూ"

"నేను చూడకపోవడమేమిటి? చీకట్లో అంత కనిపించకపోయినా వెలుగులో ఇట్టే గుర్తు పట్టగలను? నేను ఆమె భర్తను"

"నిజమే! మీరు కాకపోతే నేనా కాని, ఆవిడ తన కన్నబిడ్డ వంటి కుక్కను పోగొట్టుకుని గంపెడు దుఃఖంతో ఉంటే మీరు కొత్త కుక్కనుతెచ్చి ఆమె కన్నపేగును అవమానించినట్లు ఫీల్ అవుతుంది. ఆ తెచ్చిన కుక్కనే మీపైకి ఉసిగొల్పి రక్తం వచ్చేలా రక్కిస్తుంది. అప్పుడు మీరు మందులూ మాకులూ కూడా కొనుక్కోవచ్చు. ఏమంటారు రంగనాధంగారూ"

"అయ్యా! మిమ్మల్ని ఈ రిసెప్షన్‌లో కూర్చోబెట్టినది ఎవరు?"

"ఈ ఆఫీసుకు కర్తను, కర్మను నేనే"

"హతోస్మి! ఇందాక మనుషులను పెట్టి వెదికిస్తామన్నారు"

"ఎవర్నీ? మీ ఆవిడ్నా?"

"నా బొంద మా కుక్కను"

"ఓ అదా...మనం ఎటునుండి ఎటో వెళ్తున్నాం"

"ఇటు వచ్చినప్పుడే అనుకున్నాను ఎటో వెళ్లాల్సింది ఇటొచ్చానే అని"

"అది కాదయ్యా మున్సిపాలిటీవాళ్లతో మాకు సంబంధాలుంటాయి. వారితో చెప్పి ఇలాంటి పనులు చేయిస్తాం"

"అనుకున్నాను... ఈ ఆఫీసు ఇంత చెత్తగా ఉన్నప్పుడే ఇదేదో మున్సిపాలిటీవారి అనుబంధ కార్యాలయం అని. అదిసరే మా కుక్కను మీవాళ్లు ఎలా గుర్తు పడతారు?"

"భలేవారే... మీరు మరీ మొహమాట పెట్టేస్తున్నారు. మీ మొహం చూసాక మీ కుక్కను గుర్తు పట్టడం అంత కష్టమా?"

"ఏంటండీ అసలు విషయంలోకి రండి. అవతల మా ఆవిడ ఎంత దిగులు పడుతోందో? పొద్దుట్నుండీ కేవలం స్నాక్స్ తింటూ టీవీలో వచ్చే ఏడుపుగొట్టు సీరియల్స్‌లో ఆ కుక్క మూతి పిందెగాళ్లను చూసి ఎంత గుక్కపట్టి ఏడుస్తోందో పాపం"

"అదే...అదే అక్కడికే వస్తున్నా. మీరు మీ కుక్క పాస్‌పోర్ట్ సైజు ఫోటో ఒకటి, ఫుల్‌లెంగ్త్ ఫోటో ఒకటి ఇవ్వండి"

"నేను దానికి సంబంధాలు చూడమనడంలేదు.వెదికి పట్టుకోమంటున్నా. దానికి రెండు మూడు రకాల ఫోటోలు ఎందుకు? అయినా కుక్కంటే మనిషా ఏమిటి దానికి ఫోటోలు డిఫరెంట్ యాంగిల్స్‌లో తీసి పెట్టుకోవడానికి? ఆనవాళ్లు చెబుతాను రాసుకోండి"

"ఎంత మాటన్నారు ధర్నాథంగారూ! ఈమాటగాని అమలగారుగానీ, మేనకాగాంధీగారు వింటే ఇంకేమైనా ఉందా? మీమీద కేసు బుక్ చేసి జంతు జాతి అవమానం కింద బొక్కలో తోయిస్తారు. అప్పుడు ఆ కుక్కలు మిగిల్చిన బొక్కలే మీకు గతి"

"రామా! నా పేర...ఛీఛీ..ఛీ.. మావాళ్లు నాకీ పేరు ఎందుకు పెట్టారా అన్నంత అసహ్యం వేస్తోంది. అయ్యా ఆ కేసు నేను చూసుకుంటానుగానీ ఆనవాళ్లు రాసుకుంటారా?"

"రాసుకుంటారా ఏమిటి? అప్పుడే మొదలుపెట్టేస్తేను. దానికి అందమైన బొచ్చు ఉంది రెండు కళ్లు, రెండు చెవులు, నాలుగు కాళ్లు, వెనుక తోక"

"అయితే సరే మీ కుక్క మీకు దొరికినట్టేననుకోండి."

"సరేలే... అది దొరికేవరకూ మా ఆవిడ మా ఇంట్లో నిలబడ్డైనా నిలబడనీయదు. పడుకోడం కూడానా? కుక్కకంటే హీనమైపోయింది నా బతుకు."

"అంతలా నిరాశపడకండి సుర్నాథంగారూ. మేము మా ఆఫీసు పెట్టిందే మీ కుక్కలాంటి వాళ్లకు గాడిద చాకిరీ చేసేందుకు"

"అయ్యో...నా పేరు" అంటుండగానే జేబులో సెల్ మోగింది.

"ఆ..ఏమిటి చెప్పు" అడిగాడు భార్య గొంతు విని."

"..."

"నిజమా? వచ్చేస్తున్నా... ఇదిగో వస్తున్నా"

"ఏమైందండీ?"

"మా కుక్క దొరికింది. దానంతటదే తిరిగి వచ్చిందిట"

"నేను చెబుతూనే వున్నానుగా. అది నీతిలేని కుక్క అని. మా నోటిదాకా వచ్చిన అన్నాన్ని లాగేసింది."

"దరిద్రం వదిలిపోయింది. లేకపోతే నేను మీ చుట్టూ తిరిగి మీ తలాతోకా లేని మాటలు వింటూ ఆ కుక్కతోక లాగ అయిపోయేవాడ్ని. వస్తా"

"అది కాదండీ. మీకు వేరే ఏ ఇతర సహాయం కావాలన్నా మేము సిద్ధంగా ఉన్నాం గుర్నాథంగారూ"

"అయ్యా... నా పేరు గుర్నా...ఆ..." మూర్ఛపోయి నేలమీదున్నాడు గుర్నాథం.

★

## కొత్త వరి వంగడం సభంగిధన్

ఈ ఏడు ముందు వర్షాలు రాక, తరువాత అధిక వానలవల్ల వరి పంట దెబ్బతిన్న సంగతి తెలిసిందే. అయితే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్, ఫిలిప్పీన్స్‌లోని ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్లు సంయుక్త పరిశోధనలో ఇటీవల కనుగొన్న కొత్త వరి వంగడం 'సభంగిధన్' అన్ని వాతావరణాలను తట్టుకోగలదని, అధిక దిగుబడి ఇవ్వగలదని శాస్త్రజ్ఞులు అంటున్నారు. ముఖ్యంగా వర్షాభావ సమయంలో ఈ వరినాట్లు భూమి లోపలి తేమని పీల్చుకుని జీవించి గొప్ప దిగుబడిని ఇవ్వగలవట. భవిష్యత్తులో చత్తీస్‌ఘఢ్, బీహార్, ఎపి, యుపి వెస్ట్‌బెంగాల్, పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో ఈ సభంగిధన్ ధాన్యాన్ని సాగు చేయనున్నారట.

## విడాకుల రికార్డు

లండన్‌కు చెందిన బెర్టీ, జెస్సీలు 36 ఏళ్ల సంసారం తరువాత తమ 97వ ఏట విడాకులు పుచ్చుకుందామనుకున్నారుట. ఆఖరికి వారి 98వ ఏట విడాకులు మంజూరయ్యాయి. ఇంత పెద్ద వయస్సులో విడాకులు తీసుకున్న వీరిదే ప్రపంచ రికార్డు.అయితే కొన్ని నెలల తరువాత బెర్టీ చనిపోయాడు. ప్రస్తుతం జెస్సీ వృద్ధాశ్రమంలో వుంది.

-తటవర్తి

